క్లుప్తంగా

పశువులకు టీకాలు తప్పనిసరి



టీకా వేస్తున్న పశువైద్యాధికారి వినోద్

చిలప్‌చెడ్(నర్సాపూర్): ముందస్తు జాగ్రత్తగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయాలని వెటర్నరీ సర్జన్ వినోద్ అన్నారు. శనివారం ఆయన సిబ్బందితో కలిసి మండల కేంద్రం చిలప్‌చెడ్‌లోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ.. పశువులకు టీకా వేయడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి, అది ఆరోగ్యంగా, బలంగా తయారవుతుందన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ ఇబ్రహీం, ఓఎస్ శంకర్, అరవింద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం



శేరిపల్లిలో ఎమ్మెల్యే రోహిత్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ చిత్రపటానికి కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. శేరిపల్లి – మిర్జాపల్లి రైల్వే స్టేషన్ రోడ్డుకు రూ. 1 కోటి నిధులు మంజూరయ్యాయి. దీంతో శనివారం శేరిపల్లి బైపాస్ రోడ్డు వద్ద కాంగ్రెస్ నాయకులు రోహిత్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ మాట్లాడుతూ.. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సహకారంతో ప్రభుత్వం రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కార్యదర్శి మనోజ్, చిన్న కృష్ణాగౌడ్, నర్సింలుగౌడ్, ధర్మ, యూత్ కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణాగౌడ్, మోతీలాల్, భానుప్రసాద్ ఉన్నారు.

చెరువు బుంగను పూడివేత



చెరువు బుంగను పూడ్చివేయిస్తున్న అధికారులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ గ్రామ చెరువుకు శనివారం బుంగ పడింది. ఈ విషయం తెలుసుకున్న అధికారులు జేసీబీ సహాయంతో బుంగను పూడ్చివేయించారు. ఊర చెరువుకు బుంగపడిన విషయాన్ని స్థానికులు పంచాయతీ కార్యదర్శి రాజుకు సమాచారం ఇవ్వడంతో వెంటనే ఇరిగేషన్ అధికారులకు సమాచారమిచ్చారు. అనంతరం చెరువు వద్దకు వెళ్లి బుంగను పూడ్చివేయించారు. చెరువు కట్టకు త్వరలోనే మరమ్మతులు చేయించి, ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా తగిన చర్యలు చేపడతామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

భూ పంచాయతీలో కత్తితో దాడి

పాపన్నపేట(మెదక్): దాయాదుల మధ్య జరగుతున్న భూ పంచాయతీలో అన్నపై తమ్ముడు కత్తితో దాడి చేసిన సంఘటన శనివారం మండల పరిధిలోని నామాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ముచ్చె చిన్న రామయ్య, ముచ్చె లక్ష్మయ్య సొంత అన్నదమ్ములు. రామయ్య కొడుకు లింగమయ్య పేరిట 7 గుంటల భూమి ఎక్కువగా నమోదైంది. ఆ భూమిని తిరిగి తన పేరిట చేసి ఇవ్వాలని లక్ష్మయ్య కొడుకు కుమార్ కోరుతున్నాడు. రెండేళ్లుగా ఈ వివాదం కొనసాగుతోంది. శనివారం గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద పంచాయతీ జరిగింది. ఈ క్రమంలో ముచ్చె కుమార్ వేట కత్తితో లింగమయ్యపై దాడి చేయగా గొంతు, తలపై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో గ్రామస్తులు కుమార్‌ను చితక బాదగా, అతడు పారిపోయి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలిసింది. గ్రామస్థులు లింగమయ్యను వెంటనే ఆటోలో పాపన్నపేట వరకు తీసుకెళ్లి, అక్కడి నుంచి 108లో మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ వివరించారు.

విద్యుత్ ఏఈఈగా శ్రీనివాసరావు

దుబ్బాకటౌన్: రాయపోల్ విద్యుత్ శాఖ ఏఈఈగా శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. గతంలో తొగుట మండలం ఏఈఈగా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తినా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు.

పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి

- పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్
- హాజరైన అధికారులు, టీచర్లు



ఎల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో పాల్గొని మాట్లాడుతున్న ఎంఈఓ తారా సింగ్

నర్సాపూర్ రూరల్: పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంఈఓ తారా సింగ్ సూచించారు. శనివారం మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలలో టీచర్స్, పేరెంట్స్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలలో జరిగిన సమావేశాలకు హాజరై మాట్లాడారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధించిన పాఠాలు, హోంవర్క్‌పై ఇంటి వద్ద తల్లిదండ్రులు కొంత సమయాన్ని వెచ్చించి.. ఆరా తీయాలన్నారు. పాఠశాలకు పోయి వస్తున్నారని నిర్లక్ష్యం చేయకూడదన్నారు. సెల్‌ఫోన్లకు, టీవీలకు పిల్లలను దూరంగా ఉంచాలన్నారు. ఈ సమావేశాల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచిగా చదువుకోవాలి

నిజాంపేట(మెదక్): విద్యార్థులు ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండి చదువుకోవాలని మండలంలోని రాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పద్మారెడ్డి సూచించారు. శనివారం స్కూలులో నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకొని తమ తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలని సూచించారు. ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, అర్జున్, సుకన్య, నరేశ్, కుమారస్వామి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాళ్లకల్ ఉన్నత పాఠశాలలో..

మనోహరాబాద్(తూప్రాన్): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులపై తమ తల్లిదండ్రులు ఇంటి వద్ద ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఉందని కాళ్లకల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నర్సింగం సూచించారు. శనివారం మండలంలోని కాళ్లకల్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మంజుల ఆధ్వర్యంలో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. పాఠశాలల చదువుతున్న ప్రతీ విద్యార్థి చదువుకు కృషి చేస్తున్నామన్నారు. హోం వర్క్ ని తల్లిదండ్రులు నిత్యం పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల వసతులపై తల్లిదండ్రుల ఆగ్రహం



సమావేశంలో ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో కనీస వసతులు కల్పించకపోవడంపై మండిపడ్డారు. పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సదుపాయం లేదని, బాలురకు మూత్రశాలలు లేవని, మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండటంలేదని, పుచ్చు కూరగాయలు తెచ్చి పిల్లలకు పెడుతున్నారని ఆరోపించారు. భోజనం నిర్వహణ సరిగ్గా లేక సగానికి పైగా విద్యార్థులు ఇళ్ల నుంచి బాక్సులు, నీళ్ల బాటిళ్లు తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న టాయిలెట్స్ నిర్మాణాలను పూర్తి చేయించేలా, కనీస వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

- దళిత సంఘాల నాయకులు



మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

కొల్చారం(నర్సాపూర్): దళితులపై దాడులు చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి నాగరాజు, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం గ్రామాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా మండలంలోని తుక్కాపూర్ గ్రామంలో తలెత్తిన వివాదం కారణంగా దళితులపై జరిగిన దాడిని హేయమైన చర్యగా పేర్కొన్నారు. మానవుడు అంతరిక్షంలోకి వెళ్తున్న తరుణంలో దళితులపై దాడులకు దిగుతూ శారీరకంగా, మానసికంగా హింసిస్తున్న సందర్భాలు తరచూ చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ మధ్యకాలంలో నర్సాపూర్ నియోజకవర్గంలో మరీ ఎక్కువగా ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం దురదుష్టకరమన్నారు. దాడి చేసిన వారిపై పోలీసులు ఈ నెల 11న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినప్పటికీ, అరెస్టు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. రాజకీయ నేతల ఒత్తిడితోనే పోలీసులు వెనక్కు తగ్గుతున్నారంటూ ఆరోపించారు. సోమవారం లోగా అరెస్టు చేయకుంటే రంగంపేటలోని అంబేడ్కర్ విగ్రహం వేదికగా దళిత సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు ప్రచార కార్యదర్శి ఆకుల పెంటయ్య, జర్నలిస్ట్ జైపాల్, దళిత సంఘాల నాయకులు దుర్గయ్య, పాపయ్య, దేవయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్



నర్సాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నర్సాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి రైతుబంధు ఇవ్వకుండా రైతులను మోసం చేస్తుందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శేఖర్ ఆరోపించారు. శనివారం పట్టణంలో బస్టాండ్ వద్ద పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైతుబంధు ఇవ్వకుండా రైతులను మోసం చేసిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలం అయిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శివకుమార్, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బబియానాయక్, పరమేశ్వర్‌రాజు, భిక్షపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేటలో నిరసన

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేయాలని సీఎం దిష్టి బొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పంట కోతకు వచ్చిన రైతు భరోసా నిధులు విడుదల చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వం వెంటనే రైతు భరోసా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మాలి



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు

కొల్చారం(నర్సాపూర్): ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని రైతులు తమ వరి ధాన్యాన్ని విక్రయించాలని కిష్టాపూర్ పీఏసీఎస్ చైర్మన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశంగౌడ్ రైతులను కోరారు. శనివారం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. తేమ లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఈసారి సన్న రకం వడ్లకు బోనస్ కింద క్వింటాల్‌కు రూ.500 చెల్లించడం ఈ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ ప్రభాకర్, డైరెక్టర్లు షేకులు, పోచయ్య, రాములు, సీఈఓ నవీన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- ఎంఈఓ గురునాథ్



మాట్లాడుతున్న ఎంఈఓ గురునాథ్

రేగోడ్(మెదక్): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంఈఓ గురునాథ్ హెచ్చరించారు. ఎమ్మార్సీ కార్యాలయంలో శనివారం ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమయపాలన తప్పకుండా పాటించాలని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని తెలిపారు. విద్యార్థులకు చదవడం, రాయడం నేర్పాలని చెప్పారు. పాఠశాల రికార్డుల సక్రమంగా ఉండేలా చూసుకోవాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్‌ల హెచ్‌ఎంలు సుశీలరాణి, ప్రేమ్ ప్రసాద్‌రావు, ఎంఐఎస్ శ్వేత, సీఆర్‌పీ సంతోష్, సీఓ సిద్దు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక, శారీరక దృఢత్వం



ట్రోఫీతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులకు క్రీడలతో భవిష్యత్‌తో పాటు మానసిక, శారీరక దృఢత్వం లభిస్తుందని ఎస్‌జీఎఫ్ మెదక్ జిల్లా సెక్రటరీ రమేశ్ అన్నారు. శనివారం నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామరాజు పాఠశాల ప్రాంగణంలో జరిగిన జిల్లా స్థాయి అండర్-14 బాలుర ఖోఖో పోటీల్లో కౌడిపల్లి మండల విద్యార్థులు ప్రథమ స్థానాన్ని సాధించారు. ఈ సందర్భంగా విజేతలకు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ రమేష్ ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పీడీలు వైవి, రమేశ్‌కుమార్, పూర్ణచందర్, శేఖర్, పీఈటీలు కార్తీక్, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో మెరుగైన వైద్యం

నర్సాపూర్: సీఎంఆర్‌ఎఫ్ ఫండ్ పథకంతో మెరుగైన వైద్యం పొందే అవకాశం ఉందని ఎమ్మెల్యే సునీతారెడ్డి చెప్పారు. కౌడిపల్లి మండలం భీమ్లా తండాకు చెందిన మాలికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ. రెండు లక్షల ఎల్‌ఓసీ వచ్చిందని, సదరు లేఖను ఆమె మాలి కుమారుడు సామ్యానాయక్‌కు శనివారం అందజేశారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్‌కుమార్, శేఖులు ఉన్నారు.

ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): పట్టభద్రులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఉప తహసీల్దార్ షఫీయోద్దీన్ సూచించారు. త్వరలో జరగబోయే పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హులైన పట్టభద్రులు తహసీల్దార్ కార్యాలయంలో నవంబర్ 6 వరకు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

విజన్ సంస్థ డైరెక్టర్ కైలాసం

రామాయంపేట(మెదక్): సుప్రీంకోర్టు తీర్పు మేరకు బాల్య వివాహాల నిరోధానికి ప్రతీ జిల్లాకు ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించాల్సిన అవసరం ఉందని విజన్ సంస్థ డైరెక్టర్ కై లాస్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. చిన్నారుల విద్య, జీవన అవకాశాలను, ఆశలను బాల్య వివాహాలు చిదిమివేస్తాయన్నారు. ఈ సామాజిక రుగ్మతను రూపు మాపడానికి బహుముఖ కార్యాచరణ ఎంతైనా అవసరమని అభిప్రాయపడ్డారు. బాల్య వివాహాల నిషేధ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ఈవిషయమై రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇలాంటి సాంఘీక దురాచారాలను అరికట్టడానికి తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

పెద్దశంకరంపేట(మెదక్): ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వైద్యులు శ్రీనివాస్ విద్యార్థులకు రక్తహీనత ఇతర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ వెంకటేశం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

చాకరిమెట్లలో భక్తుల పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకం, మన్యసూక్త పారాయణం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించున్నారు. దాతల సాయంతో భక్తులకు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ఈఓ శ్రీనివాస్, ప్రధాన అర్చకులు దేవదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం



నారాయణపూర్ ప్రాథమిక పాఠశాలలో పంపిణీ చేసిన స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

నర్సాపూర్ రూరల్: గ్రామీణ ప్రాంతంలోని పేద మధ్యతరగతి పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని మండలంలోని నారాయణపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రవికుమార్ అన్నారు. శనివారం హైదరాబాద్‌కు చెందిన స్మార్ట్ డాక్స్ బిజినెస్ సొల్యూషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెయింటింగ్ బాక్స్, కంపాక్స్ బాక్సులు, వాటర్ బాటిల్స్, ఆయా రకాల స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేదవారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్మార్ట్ డాక్స్ బిజినెస్ సొల్యూషన్ హెచ్‌ఆర్ ఆనంద్ బాల, మార్కెటింగ్ లీడర్ శ్రీకాంత్, పీఏసీఎస్ డైరెక్టర్ కృపచారి, విద్యా కమిటీ సభ్యులు పెద్దలు, పోచయ్య, రామ్‌రెడ్డి, నరేష్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, కృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే ప్రశ్నించడం అలవర్చుకోవాలి

- ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట(మెదక్): మూఢనమ్మకాలపై విద్యార్థి దశలోనే ప్రశ్నించడం అలవర్చుకోవాలని ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేష్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు నిజాంపేట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శంకర పాఠశాలల్లో సైన్స్ – మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలోని మూఢనమ్మకాలను విద్యార్థులు వదిలిపెట్టి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలని, దొంగ స్వాములు భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని ఆర్థికంగా, సామాజికంగా మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూఢనమ్మకాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అజీమాన్, ఏఎస్ఐ జైపాల్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సునీత, బన్సీలాల్ పోలీస్ సిబ్బంది, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ

- మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పెద్ద శంకరంపేట మండలం ఇసుకపోయ తండాకు చెందిన కార్యకర్త నెహ్రూ మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు మంజూరైన పార్టీ సభ్యత్వ బీమా రూ.2 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టకాలంలో అందరూ పార్టీకి అండగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రమేశ్, రవీందర్ నాయక్, యాదుల్, మాజీ మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు సురేష్ గౌడ్, మాజీ గోపాల్, రమేశ్, మాణిక్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ ఎంపిక



విద్యార్థులను ఎంపిక చేస్తున్న ఎన్‌సీసీ అధికారులు

మెదక్ కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఎన్‌సీసీ సెలక్షన్స్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో చేరిన ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సెలక్షన్స్‌లో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో వందమంది ఎంపికైయ్యారు. అనంతరం ఎన్‌సీసీ ఇన్‌చార్జి సురేందర్‌రావు మాట్లాడుతూ.. సంగారెడ్డి ఆర్మీ ఆఫీసర్ మహేశ్ బచత్, గురుప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో విద్యార్థుల ఎంపిక చేశారని తెలిపారు. ఎంపికైన వారికి మూడేళ్ల పాటు చక్కటి శిక్షణను ఇస్తామని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు ఆర్మీ, పోలీసు కానిస్టేబుల్, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ తదితర ఉద్యోగాలకు అర్హతను పొందవచ్చునని చెప్పారు.

సంక్షిప్త వార్తలు

◆ పుస్తకాల అందజేత



చేగుంట(తూప్రాన్): మండలంలోని పులిగుట్ట తండాలోని పులిగుట్ట తండాలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు జ్ఞానంతో ఆనందం వర్క్ పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మోహన్ రాథోడ్ మాట్లాడుతూ విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాలు పెంపొందించడానికి జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ వర్క్ పుస్తకాలు పంపించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్, హెచ్‌ఎం నవీన్‌కుమార్, ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ ఇరువురిపై కేసు నమోదు

శివ్వంపేట(నర్సాపూర్): గొడవ పడి దాడి చేసుకున్న ఇరువురు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని దొంతి గ్రామానికి చెందిన కోదాసు పూలమ్మ గేదెను అదే గ్రామానికి చెందిన భిక్షపతికి చెందిన గేదె పొడవడంతో గేదె కన్నుపోయింది. ఈ సంఘటనలో గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి నష్టపరిహారం ఇప్పిస్తానని చెప్పాడు. దీంతో అతన్ని శనివారం గ్రామ పంచాయతీ వద్ద అడిగితే దాడి చేశాడని పూలమ్మ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. గేదెల కొట్లాటలో తనకు ఎలాంటి సంబంధం లేకున్నా.. కోదాసు స్వామి అతని భార్య పూలమ్మ శనివారం బైక్‌పై వెళ్తున్న వెంకట్‌రెడ్డిపై దాడి చేశారని బాధితుడు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

◆ మహిళా అదృశ్యం



నర్సాపూర్ రూరల్: పట్టణంలోని చాకలి బస్తికి చెందిన చాకలి బాలరాజు భార్య లలిత (50) అనే మహిళ అదృశ్యమైనట్లు నర్సాపూర్ ఎస్సై లింగం శనివారం తెలిపారు. ఈనెల 16న ఉదయం బయటకు వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదు. దీంతో భర్త బాలరాజ్, కుమారుడు వీరేశ్ ఇతర కుటుంబ సభ్యులు కలిసి బంధువుల దగ్గర, పలు చోట్ల వెతికినా లలిత ఆచూకీ తెలియరాలేదు. దీంతో శనివారం ఆమె కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.